క్లుప్తంగా

నేడు పర్చూరులో నిరసన ర్యాలీ

పర్చూరు (చినగంజాం): పేదలకు ప్రభుత్వం ఇచ్చే సెంటు భూమిలో శవం పూడ్చడానికి కూడా సరిపోదు అన్న చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా పర్చూరులో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. బడుగు బలహీన వర్గాల ప్రజలను కించపర చేలా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు చేసిన అప్రజాస్వామిక వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు వారు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయం నుంచి బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వారు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పర్చూరు (చినగంజాం): ద్విచక్రవాహనాన్ని ట్రాలీ వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన పర్చూరు వ్యవసాయ మార్కెట్ వద్ద శుక్రవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గుంటూరు జిల్లా కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన వల్లూరి రవి పర్చూరు వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనం జాగర్లమూడి వైపు తిరిగే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవి ఎడమ చేతికి గాయమై ఫ్రాక్చర్ అయింది. ద్విచక్రవాహనం వెనుక కూర్చొని ఉన్న అతని భార్య మరియమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని హుటాహుటిన పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చీరాల వైద్యశాలకు తరలించారు.

ప్రసన్నాంజనేయస్వామికి అరటిపండ్ల పూజ


అరటిపండ్ల పూజలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి అమావాస్య సందర్భంగా శుక్రవారం పదివేల అరటిపండ్లతో పూజ నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారికి ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అర్చకులు, ఉభయ దాతలు, భక్తులు మంగళవాయిద్యాల మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామి వారికి ఆవృత్తాలుగా అరటిపండ్ల పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, ఉభయదాతలు, దేవస్థాన కార్యనిర్వాణాధికారి సుభద్ర, భక్తులు పాల్గొన్నారు.

150 మంది రోగులకు పరీక్షలు


పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో షిరిడీ సాయిబాబా దేవస్థానం ప్రాంగణంలో ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. ఈశిబిరంలో డాక్టర్ బైపనేని రామాంజనేయులు 150 మంది రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. 25 మందికి కంటి లోపల శుక్లాలు ఉన్నట్లు గుర్తించామని, ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా కిమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో శిబిరం సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు, పీఆర్వో కాలేషా వలి, దేవస్థానం చైర్మన్ డాక్టర్ విశ్వేశ్వరరావు, వైస్ చైర్మన్ చప్పిడి లలితమ్మ, నరశింహరావు, రామారావు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధమైన విద్యాకానుక కిట్లు


జేవీకే కిట్లు పరిశీలిస్తున్న ఎంఈవో, సీఆర్పీలు

కారంచేడు: ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీకి సిద్ధం చేస్తున్నామని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మండల విద్యావనరుల కేంద్రంలో కిట్లను పరిశీలించారు. ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు, బూట్లు, యూనీఫారంలు వచ్చాయని వీటిని వేరు వేరుగా భద్రపరుస్తున్నామన్నారు. ఇంకా రాత పుస్తకాలు, బ్యాగ్‌లు, బెల్టులు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని కాంప్లెక్స్‌ల సీఆర్పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇక ఇంటికే పౌష్టికాహారం

- గర్భిణులు, బాలింతల ఇంటికే పౌష్టికాహారం
- ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మధ్యాహ్న భోజనం
- జులై నుంచి అమలు


అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న గర్భిణులు (ఫైల్)

వేటపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక మరింత పటిష్టంగా పౌష్టికాహారం పంపిణీ జరగనుంది. కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి వరకు పౌష్టికాహార సరుకుల్లో జరుగుతున్న అవినీతికి ఇక చెక్ పడనుంది. ఇన్ని రోజులు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించే మధ్యాహ్న భోజనం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అందించేవారు. ప్రతిరోజు పప్పు, కూరగాయలు, ఆకుకూరలతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. అయితే ప్రస్తుత విధానంపై గర్భిణులు, బాలింతలు కొందరు ఈ విధానం అమలు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీని అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే నిర్వహించింది. దీంతో జులై నుంచి వారి ఇంటికే 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' సరుకులు అందజేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

చీరాల నియోజవర్గ పరిధిలో..

నియోజకవర్గ పరిధిలోని వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టులో వేటపాలెం, చీరాల రూరల్‌లో 277 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు 0–3 సంవత్సరాల్లోపు 9,451 మంది, వీరిలో మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారులు 3,585 మంది ఉన్నారు. గర్భిణులు 1,600 మంది కాగా బాలింతలు 1,433 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ప్రతి నెలా ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం 200 ఎంఎల్ పాలు, ఉడికించిన గుడ్డు ఇస్తున్నారు. అది కూడా ఆయా కేంద్రాలకు వచ్చి తినాల్సి ఉటుంది. 7 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు మాత్రం ఇంటికే సరుకులు ఇస్తున్నారు. అయితే ఈ వైఎస్సార్ సంపూర్ణ పోషణను పక్కాగా లబ్ధిదారులకు చేరేలా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది.

సర్వేలో ఇలా..

అంగన్‌వాడీ నిర్వహణ, సేవల అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా పెడుతోంది. అంగన్‌వాడీ అధికారులు, సూపర్‌వైజర్లు పర్యవేక్షించడంతో పాటు మహిళా పోలీసులకు బాధ్యతలు అప్పగించింది. వీరు నిత్యం అక్కడ జరిగే కార్యకలాపాలతో పాటు సేవల అమలుతీరును పర్యవేక్షిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటారు. అయినా కొంతమంది సరుకులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక చాలా మంది మధ్యాహ్న భోజనం కోసం కేంద్రాల వైపు రావడం లేదు. ఇంకొంత మంది మధ్యాహ్న భోజనం ఇంటికి తీసుకెళ్తుంటారు. అసలు కొన్ని కేంద్రాలకు పిల్లలు, లబ్ధిదారులు రాకపోయినా వచ్చినట్లు చూపించి సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి వాటిపై అధికారులకు ఫిర్యాదులు ఎప్పటికప్పుడు అందుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీల్లో ఇలాంటి లోపాలు బాగోతాలు చాలానే బయటపడ్డాయి. దీంతో ప్రభుత్వం ఫిబ్రవరి నుంచి మార్చి వరకు సర్వే చేపట్టింది. కేంద్రాల్లోనే తింటారా.. సరుకులు ఇళ్లకు ఇవ్వమంటారా అంటూ కేంద్రాలకు వెళ్లి, ఫోన్ ద్వారా సర్వే చేయించారు. ఈ సర్వేలో అధిక శాతం మంది ఇంటికే సరుకులు ఇవ్వాలని కోరారు. అలాగే సరుకులు పక్కదారి పడుతున్న విధానంపై అధికారులు పూర్తిగా వివరించారు. సర్వే నివేదిక ఆధారంగా ప్రభుత్వం మధ్యాహ్న భోజన అమలు విషయంలో మార్పులు చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది.

జులై నుంచే అమలు..

కొత్త విధానం అమలు జులై నుంచి ఇంటికే సరుకులు ఇచ్చే దానిపై నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులకు ఇప్పటికే పలు సూచనలు, సలహాలు చేశారు. గర్భిణులు, బాలింతలకు సరుకులు అందించే విషయంలో చేతివాటం వద్దని పదేపదే హెచ్చరించారు. ఇకపై అలాంటివి జరిగితే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సరుకులు పంపిణీ ఇలా..

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా జులై నుంచి ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు బియ్యం 3 కేజీలు, పప్పు కేజీ, పామాయిల్ 500 మిల్లీ లీటర్, గుడ్లు 25, పాలు 2.5 లీటర్లు, రాగి పిండి 2 కేజీలు, అటుకులు కేజీ, బెల్లం 250 గ్రాములు, చిక్కీ 250 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు చొప్పున ఇంటికే సరుకులు ఇచ్చి పంపనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఈనెల 9వ తేదీ ప్రభుత్వం జారీ చేసింది.

> **జులై నుంచి ఇంటికే పోషణ సరుకులు..**
>
> 
>
> జులై నుంచి పోషణ సరుకులు నేరుగా ఇంటికే అందించనున్నాం. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇటీవల చేసిన సర్వేతో నిర్ణయం తీసుకున్నారు. మాతా, శిశు మరణాలను తగ్గించాలనే ప్రయత్నంలో భాగమే వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలు జరుగుతోంది. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
>
> – ఉమా, సీడీపీవో, వేటపాలెం

ప్రతి పల్లెకు మంచినీటి సదుపాయం


వలంటీర్లకు నియామక పత్రాలు అందిస్తున్న కరణం వెంకటేష్

- రూ.84 లక్షలతో మంచినీటి పథకానికి శంకుస్థాపన చేసిన వెంకటేష్

చీరాల: నియోజకవర్గంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి పథకాన్ని ప్రజలకు అందజేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శుక్రవారం చీరాల రూరల్ మండలం కావూరివారిపాలెంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.84 లక్షలు నిధులతో ప్రతి ఇంటికి తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక గ్రామాలలో నేటికి మంచినీటి సదుపాయం లేదన్నారు. అటువంటి గ్రామాలను గుర్తించామని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పలుమార్లు సమావేశాన్ని నిర్వహించి రూ. 84 లక్షలతో ఈ కుళాయి పథకానికి శంకుస్థాపన చేశామన్నారు. త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నేతాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్‌బీకె చైర్మన్ కావూరి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బోయిన కేశవులు, నాయకులు కావూరి యాదాలరెడ్డి, రత్నారెడ్డి, బోగిరెడ్డి, చిన్నపిచ్చిరెడ్డి, పాలిబోయిన పెదఅంకిరెడ్డి, ఆసోది సుబ్బారెడ్డి, భోగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నర్రా బ్రహ్మయ్య, జి.రామారావు, నాదెండ్ల కోటేశ్వరరావు, లేళ్ల శ్రీధర్, కోంఢ్రు బాబ్జి, మించాల సాంబశివరావు, కీర్తి వెంకట్రావులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత..

నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో నూతనంగా ఎంపికైన గ్రామ వార్డు వలంటీర్లకు శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ నియామక పత్రాలను అందించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో చీరాల మండలంలో 15, వేటపాలెం మండలంలో నలుగురికి నియామక పత్రాలు అందించారు. కార్యక్రంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి వైష్ణవి, పి.ధనుంజయ, అంకాలరెడ్డి, ఎన్.కోటేశ్వరరావు, బిట్రా శ్రీను, షేక్ కబీర్, కావూరి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగులైన కొండమ్మ, బక్కెన ప్రకాష్‌లకు వైఎస్సార్‌సీపీ వెంకటేష్ ట్రైసైకిళ్లు, కర్రలను అందించారు. పార్టీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వీటిని అందించారు.

తాతా ఎలాగున్నావ్..!


వృద్ధుడితో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: తాతా ఎలాగున్నావ్.. అవ్వ ఆరోగ్యం బాగుందా అంటూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగుతున్నాడు శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య. శుక్రవారం కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణచైతన్యను గ్రామస్తులు సాదరంగా ఆహ్వానించారు. ఇంటింటికి వెళ్లిన చైతన్య గత నాలుగేళ్లుగా ప్రభుత్వం చేసిన పలు అభివృద్ధి పనులను అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, మాజీ ఎంపీటీసీ గుండపనేని ఆనంద్‌బాబు, మాజీ జెడ్పీటీసీ ముత్తవరపు రమణయ్య, ఎం. వెంకటేశ్వర్లు, సాధినేని మస్తాన్‌రావు, మండల, స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సుందరయ్య సేవలు స్ఫూర్తిదాయకం


అద్దంకిలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న నాయకులు


జే.పంగులూరు సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


పర్చూరు: సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జే.పంగులూరు: స్వాతంత్య్ర సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమం పంగులూరులో శుక్రవారం సాయంత్రం జరిగింది. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా రాయిణి వినోద్‌బాబు, తలపనేని రామారావులు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ నేతగా, పార్లమెంట్ నేతగా ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో సుందరయ్య పనిచేశారన్నారు. రాజకీయాలలో ప్రజా ప్రతినిధిగా సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన నేత స్వాతంత్ర సమరయోధుడిగా పోరాటాల్లో ముందుండి నడిచారన్నారు. కుల సమస్య మీద అంటరానితనంపై దళితులతో సంపక్తి భోజనలు ఏర్పాటు చేయడం, నిరాడంబరంగా జీవించిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తల్లపనేని సుబ్బారావు, గుడిపూడి మల్లారెడ్డి, జి తిరుపాలు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని జేవీవీ నాయకుడు కె. రఘు చంద్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పర్చూరు (చినగంజాం): పేదల కోసం పోరాడిన పుచ్చలపల్లి సుందరయ్య గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని నిస్వార్థ సేవకుడని బాపట్ల జిల్లా సీఐటీయూ కార్యదర్శి సీహెచ్ మజుందార్ అన్నారు. సుందరయ్య వర్ధంతి పురస్కరించుకొని ప్రజాసంఘాల నాయకులు పర్చూరులో తమ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాతీయ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక


స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులతో యాజమాన్యం

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు జాతీయస్థాయిలో లోటస్ పెటల్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లు సాధించారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఇటీవల ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ పరీక్షల్లో ప్రతిభ కనపర్చి నాలుగు స్కాలర్‌షిప్‌లు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. జి ప్రవల్లిక, ఎస్ తారక నాగాంజలి స్కాలర్‌షిప్ కింద ప్రతి ఏడాది రూ. 2.25 లక్షలు చొప్పన నాలుగేళ్లకు లకు రూ. 9 లక్షలు అందజేస్తారని తెలిపారు. జాతీయ స్థాయిలో నలుగురు ఎంపిక కాగా ఇద్దరు విద్యార్థులు తమ కళాశాల నుంచి స్కాలర్‌షిప్‌లుపొందడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు.

పోలూరులో పర్యటించిన భరత్


సాంబయ్యను పరామర్శిస్తున్న భరత్

యద్దనపూడి: గత కొన్నిరోజుల క్రితం మార్టూరు దాబా వద్ద జరిగిన దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన వేమల సాంబయ్య, నూల వినయ్‌ను పోలూరులో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు గొట్టిపాటి భరత్ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ వలంటీర్లకు పురస్కారాలు

కారంచేడు: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లలో ఉత్తమ సేవలందించిన వారికి పురస్కారాలు అందించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని దగ్గుబాడు గ్రామానికి చెందిన దండమూడి బాబూరావుకు సేవావజ్ర అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే సేవారత్న అవార్డులకు గాను మండలంలోని ఆదిపూడి గ్రామానికి చెందిన ధనరాజుపల్లి నాగరాజు, దగ్గుబాడుకు చెందిన కాకి అనూష, కారంచేడుకు చెందిన నూతలపాటి సంతోషరావు, ఆవులమంద వెంకటేశ్వరావు, కుంకలమర్రు గ్రామానికి చెందిన తేలప్రోలు నాగలక్ష్మిలను ఎంపిక చేసామన్నారు. వీరికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జీ, మెడల్‌తో పాటు రూ.30 వేలు, రూ.20 వేలతో సత్కరించనున్నామన్నారు. అలాగే మండలంలోని మరో 176 మంది వలంటీర్లకు రూ 10 వేల నగదు ఉత్తమ సేవామిత్రలుగా సత్కరించే ఏర్పాట్లు చేశామన్నారు.

బల్లికురవ మండలంలో 249 మందికి సత్కారం..

బల్లికురవ: ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థలోని వలంటీర్ల సేవలను గుర్తించేందుకు రెండో ఏడాది పురస్కారాలకు 249 మందిని ఎంపిక చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ శుక్రవారం తెలిపారు. సేవావజ్ర అవార్డుకు ఎస్ఎల్ గుడిపాడుకు చెందిన మేదర సారమ్మ, సేవారత్న అవార్డుకు వల్లాపల్లికి చెందిన పరుసు నవీన్, మందా ప్రేమలత, అంబడిపూడికి చెందిన కిలాడి అరుణ, ఎస్ఎల్ గుడిపాడుకు చెందిన కందుకూరి ప్రభావతి, వేమవరం చెందిన పూనాటి శీరీషా, సేవా మిత్ర అవార్డులకు 243 మంది ఎంపికైనట్లు చెప్పారు. వీరందరికి త్వరలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య చేతుల మీదుగా పురస్కారాలతో నగదు అందజేస్తారని ఎంపీడీవో వివరించారు.

పవనసుతుడికి విశేష పూజలు


చందన అలంకారంలో ప్రసన్నాంజనేయస్వామి

యద్దనపూడి: పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో క్షేత్రపాలకుడిగా వెలసిఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో వైశాఖమాసం ముగింపు సందర్భంగా స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. వైశాఖమాసం సందర్భంగా గత నెలరోజులుగా ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామి వారికి ఆకుపూజలు, అభిషేకాలు నిర్వహించారు. చివరిరోజు శుక్రవారం స్వామివారికి చందనోత్సవం, నారికేళ, అరటిపండ్లు, తమలపాకులతో విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు దివి భావానాచార్యులు, నరసింహచార్యులు, నారాయణం మనోజ్‌కుమార్, భక్తుల గోత్రనామాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అదనపు కట్నం కోసం మహిళపై దాడి

మార్టూరు: ఓ వివాహిత కుటుంబంపై అదనపు కట్నం కోసం ఆమె భర్త, బంధువులు దాడి చేసిన ఘటనపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వలపర్లకు చెందిన తన్నీరు భవానికి అదే గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మీ ప్రసాద్‌తో మూడేళ్ల క్రితం వివాహం కాగా వీరికి ఇద్దరు సంతానం. గత కొంత కాలంగా భవానీని అదనపు కట్నం తీసుకురావలంటూ భర్త లక్ష్మీప్రసాద్ అతని కుటుంబ సభ్యులు శారీరకంగా మానసికంగా వేధించసాగారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అదనపుకట్నం విషయమై వివాదం ప్రారంభమై లక్ష్మీ ప్రసాద్ అతని తరపు బంధువులు భవానీ కుటుంబ సభ్యులపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దాడిలో భవానీకి అతని సోదరుడు పవన్ కుమార్‌లు గాయపడగా మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భవాని ఫిర్యాదుపై పోలీసులు ఆమె భర్త లక్ష్మీప్రసాద్, అత్త,మామలు తన్నీరు అంజమ్మ, లక్ష్మయ్య ఇతర కుటుంబ సభ్యులు అంకమ్మరావు, రేణుక, అంజలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

300 మందికి కంటి పరీక్షలు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 300 మంది హాజరై పరీక్షించుకున్నారు. వీరిలో 250 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష కార్యదర్శులు సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను వినియోగించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

అద్దంకి రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అద్దంకి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్) పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ టీ. రవికుమార్ అన్నారు. శుక్రవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ వరకు ఈకార్యక్రమం నిర్వహిస్తారన్నారు. వీటిని ఆరో వార్డులోని ట్యాంక్ రోడ్, రామ్‌నగర్, 16 వార్డు భవానిసెంటర్ రీడింగ్ రూమ్ వద్ద ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులు, పనికిరాని ఎలక్ట్రానిక్, ఇనుము వస్తువులు సెంటర్‌కు అందజేస్తే వాటి అవసరం ఉన్న వారికి అందజేస్తారన్నారు. వస్తువులను అందజేసేందుకు ఏరియా శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీకి సమాచారం ఇవ్వాలన్నారు.